సాక్షి కామారెడ్డి

దీపావళి శుభాకాంక్షలు

సోమవారం ၊ 20 ၊ అక్టోబర్ ၊ 2025

న్యూస్‌రీల్

మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈ నెల 23 వరకు అవకాశం

కామారెడ్డి రూరల్: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 23 వరకు పొడిగించినట్లు కామారెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారి హనుమంత రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 49 మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం మొదట ఈ నెల 18 వరకే గడువు విధించింది. అయితే, శనివారం రాత్రి వరకు మొత్తం 1,444 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కామారెడ్డి పరిధిలో 449, దోమకొండ పరిధిలో 307, బిచ్కుంద పరిధిలో 222, బాన్సువాడ పరిధిలో 240, ఎల్లారెడ్డి పరిధిలో 226 దరఖాస్తులు వచ్చాయి. మరో ఐదు రోజులపాటు గడువు పొడిగించడంతో ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారి హనుమంతరావు తెలిపారు. ఈ నెల 27న లాటరీ నిర్వహించి మద్యం దుకాణాలను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

'సాగర్' గేటు ఎత్తివేత



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల నుంచి 7,048 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక వరద గేటును ఎత్తారు. వరద గేటు ద్వారా 4,048 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలో వదులుతున్నామని ప్రాజెక్టు ఏఈ సాకేత్ తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీల)కు ప్రస్తుతం 1405 అడుగులు(17.8 టీఎంసీల) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

23న ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖోఖో సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారుల ఎంపిక ఈనెల 23న గురువారం ఉదయం 9గంటలకు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతీకుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 25 నుంచి నవంబర్ 5 వరకు పిట్లంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు పెద్దపల్లి ఇండియన్ మిషన్ హైస్కూల్‌లో నిర్వహించే 58వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. వివరాలకు 85559 96271, 94942 259901, 96762 69988 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సురక్షిత దీపావళి జరుపుకోవాలి

- ఎస్పీ రాజేశ్‌చంద్ర



కామారెడ్డి క్రైం: దీపావళి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర జిల్లా ప్రజలకు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. బాణాసంచా కాల్చేటప్పుడు గాయాలు కాకుండా, అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లను అలంకరించే క్రమంలో దీపాలు, లైటింగ్ ఏర్పాట్లు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. శబ్ద, కాలుష్య నియంత్రణ విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలు, పరిమితులను తప్పనిసరిగా పాటించాలన్నారు.

లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే పటాకులు కొనాలి

- జిల్లా ఫైర్ ఆఫీసర్ సుధాకర్



కామారెడ్డి రూరల్: లైసెన్స్ ఉన్న షాపులలో మాత్రమే పటాకులు కొనుగోలు చేయాలని జిల్లా ఫైర్ ఆఫీసర్ సుధాకర్ ప్రజలకు సూచించారు. జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 94 పటాకుల దుకాణాలకు అనుమతి ఇచ్చామని వెల్లడించారు. దుకాణాల మధ్య 3 మీటర్ల దూరం, ప్రతి షాపు వద్ద 200 లీటర్ల నీటి బ్యారెల్, 5 కిలోల ఫైర్ సేఫ్టీ సిలిండర్ ఉండాలని తెలిపారు. ప్రజలు పటాకులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. రోడ్లు, ఇళ్ల మధ్య పటాకులు కాల్చొద్దని, ఓపెన్ స్థలాల్లో మాత్రమే కాల్చాలన్నారు.



ఏసీబీ దాడిచేసిన సలాబత్‌పూర్ ఆర్టీవో చెక్‌పోస్ట్

ఓపెన్ కలెక్షన్!

- చెక్‌పోస్టుల వద్ద డ్రైవర్లు డబ్బులు వేసేందుకు బాక్సుల ఏర్పాటు
- ప్రైవేటు వ్యక్తులతో దర్జాగా వసూళ్లు
- మారని రవాణా శాఖ తీరు
- మరోసారి దాడులు చేసిన ఏసీబీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అవి చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్లు అనేకంటే కలెక్షన్ సెంటర్లు అనొచ్చు. ఎందుకంటే అక్కడ వాహనాల తనిఖీలు ఉండవు. కేవలం వసూళ్లే జరుగుతాయి. అది కూడా బహిరంగంగా నడిచే వ్యవహారమే. ఈ విషయం రవాణా శాఖ ఉన్నతాధికారులకు తెలియందీ కాదు. పైగా చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్లలో ప్రైవేటు వ్యక్తులే వసూళ్ల బాధ్యతలు చూసుకుంటారు. వాళ్లే లెక్కలు కట్టి అధికారులకు అప్పగిస్తారు. ఇదంతా బహిరంగ రహస్యం. అయితే ఏసీబీ అధికారులు అప్పుడప్పుడు దాడులు చేయడం, వాళ్ల ఎదుటే సరుకు రవాణాకు సంబంధించిన వాహనదారులు డబ్బులు తీసుకువచ్చి అక్కడ ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేసి



సలాబత్‌పూర్ చెక్‌పోస్ట్‌లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్

వెళ్లడం సర్వ సాధారణమైంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కామారెడ్డి జిల్లాలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై భిక్కనూరు మండలం పొందుర్తి వద్ద ఉన్న చెక్‌పాయింట్‌పై, అలాగే 161వ నెంబర్ జాతీయ రహదారిపై మద్నూర్ మండలం సలాబత్‌పూర్ వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారుల ఎదుటే వాహనదారులు డబ్బులు తెచ్చి బాక్సుల్లో వేసి వెళ్లారు. భిక్కనూరు మండలం పొందుర్తి వద్ద చెక్‌పాయింట్‌లో రూ.51,300 అలాగే మద్నూర్ మండలం సలాబత్‌పూర్ వద్ద చెక్‌పోస్టులో రూ.36 వేల నగదును సీజ్ చేశారు.

దాడులు దాడులే.. వసూళ్లు వసూళ్లే...

రవాణా శాఖ చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్లపై అప్పుడప్పుడు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడం, ఏవో కేసులు నమోదు చేయడం తర్వాత వసూళ్లు యథావిధిగా నడుస్తుండడం చూస్తూనే ఉన్నాం. ఏసీబీ అధికారుల కళ్లెదుటే వసూళ్ల పర్వం కొనసాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆర్టీఏ కార్యాలయాలు, చెక్‌పోస్టుల్లో జరిగే వసూళ్ల దందా విషయం అందరికీ తెలిసినా ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వ విధానాల్లో లోపాలే ఇలాంటివి కొనసాగడానికి కారణమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు దాడులు చేసి రవాణా శాఖను బద్నాం చేయడమే తప్ప, తీసుకున్న చర్యలు పెద్దగా ఏమీ ఉండడం లేదు. వసూళ్లను నిరోధించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



చెక్‌పోస్ట్‌లో ఏర్పాటు చేసిన డబ్బాలో నగదు

ఏసీబీ దాడులతో కేసుల్లో ఇరుక్కోవద్దనే ఉద్దేశంతో రవాణా శాఖ అధికారులు ప్రయివేటు సిబ్బందిని నియమించుకొని వారి ద్వారా అన్ని పనులు చేయించుకుంటారు. డ్యూటీలో ఉన్న అధికారులు, సిబ్బంది చేతితో డబ్బులు తీసుకోరు. రవాణా వాహనాలకు సంబంధించి డ్రైవర్లు, క్లీనర్లు డబ్బులు తీసుకువచ్చి అక్కడ ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేసి వెళతారు. లేదంటే ప్రయివేటు సిబ్బందికి ఇచ్చి వెళతారు. ఏసీబీ దాడులు జరిగిన ప్రతిసారీ ప్రయివేటు వ్యక్తులు చిక్కుతుంటారు.

ప్రైవేటు వ్యక్తులతో దందా..

దాడులు జరిగిన ప్రతిసారీ కనీసం రూ. 50 వేలు దొరుకుతున్నాయంటే అక్కడ ఏ మేరకు వసూళ్లు అవుతాయో అర్థమవుతోంది. రవాణా శాఖ కార్యాలయాలు, చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్లలో అన్ని వ్యవహారాలు ఓపెన్‌గానే నడుస్తాయి. డ్రైవింగ్ లైసెన్సుల జారీ నుంచి వాహనాల రిజిస్ట్రేషన్లు, మార్పిడిలు, అనుమతులు.. ఇలా ప్రతిదానికో ధర ఉంటుంది. దళారుల ద్వారానే పనులు జరుగుతాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని వెళ్లిన వారిని ఏదో ఒక వంకతో రిజెక్ట్ చేయడం, తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇంటి దగ్గర ఉండే అన్ని పనులు చేసుకోవచ్చని చెబుతారే తప్ప రవాణా కార్యాలయాల్లో మాత్రం దళారులను ఆశ్రయిస్తేనే పనులు జరుగుతాయనేది బహిరంగ రహస్యం. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినా పెద్దగా పట్టించుకోరు. అప్పుడప్పుడు మాత్రం తనిఖీలు, దాడులు చేసి చేతులు దులుపుకుంటారని పేర్కొంటున్నారు.

దాడులు తెలియక.. యథావిధిగా..

మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండలం సలాబత్‌పూర్ వద్ద ఉన్న ఆర్టీవో చెక్‌పోస్ట్‌పై శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే, ఒకవైపు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నా.. ఆ విషయం తెలియని లారీ డ్రైవర్లు చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన డబ్బాలో యథావిధిగా డబ్బులు వేస్తూ కనిపించారు. ఆ డబ్బులను ఓ ప్రయివేటు వ్యక్తి ఎప్పటికప్పుడు తీసుకెళ్లడాన్ని ఏసీబీ అధికారులు గమనించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. చెక్‌పోస్ట్‌లలో అవినీతి జరుగుతున్నట్లు తమ దృష్టికి రావడంతో ప్రభుత్వానికి నివేదించామని, దీంతో త్వరలో అన్ని చెక్‌పోస్ట్‌లను ఎత్తివేయనున్నట్లు పేర్కొన్నారు. ఇకపై చెక్‌పోస్ట్‌లలో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక యాప్ తయారు చేసి ఆ యాప్‌పై లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు.



సలాబత్‌పూర్ చెక్‌పోస్టులో ఏర్పాటు చేసిన డబ్బాలో నగదు వేస్తున్న లారీ డ్రైవర్లు

95 రోజుల్లో రెండుసార్లు..

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు 95 రోజుల్లో రెండు పర్యాయాలు దాడులు నిర్వహించారు. జూలై 16న ఇదే చెక్‌పోస్టుపై దాడి చేసిన ఏసీబీ అధికారులు.. నలుగురు ప్రయివేటు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.80 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఆదివారం ఇద్దరు ప్రయివేటు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.51,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులతో ప్రముఖులు

కామారెడ్డి అర్బన్: స్మారక క్రీడలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం.చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి శ్రీ సరస్వతి శిశుమందిర్ మైదానంలో ఆదివారం సాయంత్రం సీహెచ్ శ్రీనివాస్ స్మారక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు ఆయా జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో కామారెడ్డి జిల్లా బొల్లారం, సిద్దిపేట జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు సీహెచ్ రాజు, గడీల భాస్కర్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్, నర్సింలు, మనోహర్‌రావు, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న కామారెడ్డి బొల్లారం-సిద్దిపేట జట్లు

పదికి ప్రత్యేక కసరత్తు

- పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధం
- ఉదయం, సాయంత్రం వేళల్లో స్పెషల్ క్లాసులు
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు

నిజాంసాగర్(జుక్కల్): పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెంచి, వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 13,617 మంది విద్యార్థులు

జిల్లాలోని 306 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతోపాటు గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 13,617 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. పబ్లిక్ పరీక్షలకు ముందుగానే ఆయా పాఠశాలల్లో విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం సాయంత్రం వేళలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



మహమ్మద్ నగర్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతను సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేయడంతోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక క్లాసులు ఉంటాయి.

– రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి

పోలీసుల అదుపులో రియాజ్

- సారంగాపూర్ ప్రాంతంలో పట్టుకున్న ప్రత్యేక బృందాలు
- అడ్డుకున్న స్థానిక యువకుడిపై కత్తితో దాడి చేసిన నిందితుడు
- వదంతులు నమ్మొద్దు : సీపీ

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్యకేసులో నిందితుడైన పాతనేరస్తుడు రియాజ్ పోలీసులకు ఆదివారం చిక్కాడు. బైక్ చోరీ కేసులో శుక్రవారం రాత్రి అరెస్టు చేసి తీసుకొస్తుండగా కత్తితో కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసి పరారయ్యాడు. నిందితుడిని పట్టుకునేందుకు సీపీ సాయిచైతన్య ఎనిమిది బృందాలను రంగంలోకి దింపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సారంగాపూర్ ప్రాంతంలో ఓ లారీ విడిభాగమైన క్యాబిన్‌లో రియాజ్ దాక్కున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ప్రత్యేక బృందాలు అక్కడికి చేరుకోగానే గమనించిన రియాజ్ పారిపోతుండగా పోలీసులు వెంబడించారు. అదే సమయంలో రియాజ్‌ను పట్టుకునేందుకు ఆసిఫ్ అనే యువకుడు ప్రయత్నించగా అతడిపై గాజు ముక్కతో దాడి చేశాడు. అప్పటికే పోలీస్ బృందాలు రియాజ్‌ను చుట్టుముట్టాయి.

ఎన్‌కౌంటర్ వదంతులు

రియాజ్‌ను సారంగాపూర్ ప్రాంతంలో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారని ఆదివారం మధ్యాహ్నం వదంతులు వ్యాపించాయి. అయితే రియాజ్ తమ అదుపులోనే ఉన్నాడని, ఎన్‌కౌంటర్ చేయలేదని సీపీ సాయి చైతన్య ప్రకటన విడుదల చేయడంతో వదంతులకు ఫుల్‌స్టాప్ పడింది.



రియాజ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వీడియో వైరల్

రియాజ్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో అదే ప్రాంతంలో ఒకరు తీసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. నిందితుడి వద్ద కత్తి ఉందనే అనుమానంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అదుపులోకి తీసుకున్నారు. తుపాకులతో గురిపెట్టి నేలపై పడుకోబెట్టి, అనంతరం బేడీలు వేసి, తాళ్లతో కట్టేసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భద్రత నడుమ ఆస్పత్రికి..

నిందితుడు రియాజ్‌కు దెబ్బలు తగలడంతో ప్రభుత్వ ఆస్పత్రిలోని ఖైదీలకు వైద్యం అందించే వార్డులో ఉంచారు. మొదట ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స చేశారు. ప్రస్తుతం రియాజ్ ఆరోగ్యంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో గాయలపాలైన ఆసిఫ్‌ను పోలీసులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆసిఫ్ పరిస్థితి నిలకడగా ఉంది.

తీవ్రంగా గాలించిన ప్రత్యేక బృందాలు

శుక్రవారం రాత్రి నుంచి 8 ప్రత్యేక బృందాలు రియాజ్ కోసం తీవ్రంగా గాలించాయి. నిందితుడు మొదట జిల్లా దాటినట్లు భావించినప్పటికీ సరిహద్దు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం నగరంలోనే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. రియాజ్ పాతనేరస్తుడు కావడంతో అతడు తరచూ తిరిగే ప్రాంతాలు, కలిసే వ్యక్తులపై పోలీసులు నిఘా సారించి ఫోన్ నంబర్‌ను ట్రేసింగ్‌లో పెట్టారు. కానీ రియాజ్ ఫోన్ ఉపయోగించకుండా చోరీ చేసిన బైకుతో పోలీసుల కన్నుగప్పి వివిధ ప్రాంతాలు తిరిగాడు. బర్కత్‌పురాలోని ఓ లాయర్ వద్దకు వెళ్లిన రియాజ్ అతడి ద్వారా లొంగిపోయేందుకు ప్రయత్నించినప్పటికీ సదరు లాయర్ సాయం చేసేందుకు నిరాకరించినట్లు సమాచారం.

మార్కెట్‌కు దీపావళి శోభ

- నేడు లక్ష్మీదేవి పూజలు
- గ్రామాలు, పట్టణాల్లో పండుగ వాతావరణం

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని మార్కెట్లలో ఆదివారం సందడి నెలకొంది. సోమవారం దీపావళి పండుగ నేపథ్యంలో పట్టణంలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. పూజా సామగ్రి, దీపెంతలు, పూలు, ఇతర సామగ్రి కొనుగోళ్లతో రద్దీ నెలకొంది. సుభాష్ రోడ్డు, జేపీఎన్ రోడ్డు, తిలక్‌రోడ్, మాయబజార్, సిరిసిల్లా రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతాలలో వ్యాపారాలు జోరుగా సాగాయి.



కొనుగోలుదారులతో సందడిగా మారిన కామారెడ్డిలోని తిలక్‌రోడ్డు మార్కెట్

మురికి కాలువతో ముసలమ్మ జీవనం



ఈ అవ్వది ఏ ఊరో ఎవరికీ తెలియదు. కామారెడ్డి పట్టణానికి ఎందుకు వచ్చిందో తెలియదు. అరుగుల మీద పడుకొని పొద్దున్నే లేచి అడ్లూర్ రోడ్డులో మురికి కాలువను శుభ్రం చేస్తూ ఉంటుంది. ఒక రోజో, రెండు రోజులో కాదు.. నెలల తరబడిగా క్రమం తప్పకుండా మురికి కాలువలో నుంచి కాగితాలు, చెత్తను ఏరిపారేస్తూ ఉంటుంది. ఎవరైనా దయతలచి బువ్వ పెడితే తిని ఎక్కడో ఒక చోట పడుకుంటుంది. మురికి కాలువను శుభ్రం చేస్తుండగా రోడ్డున వెళ్లేవారంతా ఆమెనే చూస్తుంటారు.

- సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

క్లుప్తంగా

అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



మాచారెడ్డి: పాల్వంచ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.చంద్రం, అధ్యక్షునిగా ఎం.బాల్ నర్సు, ఉపాధ్యక్షుడిగా జి.నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శంకర్ బాబు, కోశాధికారిగా సీహెచ్. మైసయ్య, కార్యదర్శిగా డి.రవి, సలహాదారులుగా సీహెచ్ లక్ష్మణ్, నడిపి నర్సింలు, శ్రీను, రమేష్, కార్యవర్గ సభ్యులుగా మల్లేష్, నర్సింలు, రాకేష్, చిన్న నర్సింలు, బాల ఎల్లయ్య, రాజులను ఎన్నుకున్నారు.

పల్లెల్లో సినిమా షూటింగ్ సందడి



బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణానికి చెందిన అద్నాన్ నిర్మాతగా పలు భాషల్లో తెరకెక్కుతున్న వాంపర్స్ సాగా చిత్రంలోని పలు సన్నివేశాలను బాన్సువాడ పట్టణంతో పాటు పలు గ్రామాల్లో చిత్రీకరిస్తున్నారు. మండలంలోని బోర్లంక్యాంపు, తాడ్కోల్ తదితర గ్రామాల్లో శనివారం రాత్రి చిత్ర సన్నివేశాలు తీశారు. హర్రర్ మూవీ కావడంతో రాత్రిపూట శ్మశానవాటిక, ఊడలమర్రి చెట్ల కింద షూటింగ్ తీస్తున్నారు. ఇటీవల చిత్రం టీజర్ విడుదల చేయగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సంచలనం సృష్టించిందని చిత్ర నటుడు, దర్శక, నిర్మాత అబ్దుల్ అద్నాన్ పేర్కొన్నారు. సినిమాలో యాక్షన్, కామెడీ, రొమాన్స్, హర్రర్ ఓ స్థాయిలో ఉంటాయన్నారు. చిత్ర షూటింగ్ సందర్భంగా సినీతారలు జుబేర్‌ఖాన్, సనా సుల్తానా, బుష్రా షేక్, చేతన్, హన్స్‌రాజ్ సందడి చేశారు.

ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలి

నిజామాబాద్ నాగారం: రాజ్యాంగం కల్పించిన హక్కులకు ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండి అమలు చేయాల్సిన నైతికత ఉందని సీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో పౌరహక్కుల సంఘం(సీఎల్‌సీ) ఉమ్మడి జిల్లా 17వ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పౌర హక్కుల సంఘం ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ బలమైన పౌర హక్కుల ఉద్యమాన్ని నిర్మిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఉద్యమం, తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే ప్రజలతో కలిసి హక్కుల ఉద్యమాన్ని నిర్మిస్తోందన్నారు. కశ్మీర్ మొదలు కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి గుజరాత్ వరకు అన్ని ప్రాంతాల్లోని హక్కులని, మారణ హోమానికి వ్యతిరేకంగా కార్యాచరణ కొనసాగిస్తోందన్నారు.

పత్తి రైతు చిత్తు..!

- భారీ వర్షాలతో తగ్గిన దిగుబడి
- పెట్టుబడులు కూడా రాని వైనం



పెద్దకొడప్‌గల్ గ్రామ శివారులో సాగు చేసిన పత్తి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఇటీవల నెల రోజుల పాటు నిరంతరాయంగా కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో మొత్తం 5 వేల 310 ఎకరాలల్లో పత్తి పంటను రైతులు సాగుచేశారు. ఇది వరకు పత్తి పంటను మూడు,నాలుగు సార్లు తీసేవారు. 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి పండేది. ఇప్పుడు కురిసిన భారీ వర్షాలకు తెగుళ్లు వచ్చి దిగుబడి తగ్గి ఒకేసారి పత్తిని తీయగానే పత్తి మొక్కలను తొలగించే పరిస్థితి వచ్చింది. దిగుబడి 4 క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్లకు తగ్గిపోయింది. గతంలో కంటే పత్తి పంటకు పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎకరం పత్తి పంట సాగు చేయాలంటే కౌలుతో కలిపి రూ.50 వేల వరకు ఖర్చు అవుతున్నాయి. ఎకరం భూమి కౌలు రూ.25 వేల వరకు ఉండగా ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు కలిపి మరో రూ.25 వేలు అవుతోంది. ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చి రూ.10 వేల ధర ఉంటేనే రైతులకు గిట్టుబాటు ఉంటుంది. పంట చేనులో ఉన్నదన్నా ఏరుకోవాలంటే కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏరింది అమ్ముకుందామంటే మార్కెట్లో మద్దతు ధరలేదు. ఓపెన్ మార్కెట్లో దళారీలదే రాజ్యం నాణ్యత పేరుతో వారు నిర్ణయించిందే ధర. రూ.4,800 నుంచి రూ.5, 200 వరకు ధరకే కొనుగోలు చేస్తున్నారు. తక్షణమే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తడిసిన పత్తి నాణ్యతా ప్రమాణాల ఆంక్షలు లేకుండా రూ.10 వేల కనీస ధర తగ్గకుండా కొనుగోలు చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అధికారులను, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రెండో పంట సాగుపైనే ఆశ..

పత్తి పంట దెబ్బతినడంతో రెండో పంటగా రైతులు మొక్కజొన్నపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. తీయటానికి వచ్చిన పత్తిని తీసుకుని వెంటనే పత్తిని తొలగించి దాని స్థానంలో మొక్కజొన్న పంట వేసేందుకు రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. గతేడాది కూడా పత్తి పంట నష్టం రావడంతో రెండో పంటగా మొక్కజొన్న సాగుచేశారు. ఎకరానికి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చి క్వింటా రూ.2 వేలపైనే పలకడంతో రైతులకు కొంత ఊరట లభించింది.

భారంగా మారింది..



నాకున్న మూడు ఎకరాలల్లో పత్తి పంట వేసుకున్నాను. భారీ వర్షాలకు పత్తి నల్లబారడమే కాకుండా నాణ్యత కూడా తగ్గిపోయింది. 8 నుండి 10 క్వింటాళ్ల పత్తి పండేది. ఇప్పుడు కురిసిన భారీ వర్షాలతో తెగుళ్లు వచ్చి దిగుబడి తగ్గింది. తక్షణమే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.కనీసం రూ.10 వేలు ధర తగ్గకుండా కొనుగోలు చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి. – తోట కిష్టయ్య, రైతు, పెద్దకొడప్‌గల్

పెట్టుబడులు పెరిగాయి



నేను 8 ఎకరాలు కౌలు తీసుకున్నాను. గతంలో కంటే పత్తి పంటకు పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎకరం పత్తి పంట సాగు చేయాలంటే కౌలుతో కలిపి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చి రూ.10 వేలు ధర ఉంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. కూలీలు దొరక్క కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– గోతి సుప్పంద్, రైతు, టికారం తండా

కుక్కల స్వైర విహారం

- వాహనదారులను వెంటాడుతున్న కుక్కలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దోమకొండ శివారులో రోడ్లపై కుక్కలు

దోమకొండ: గ్రామాల్లో ఎక్కడా చూసినా శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిని వెంటాడుతున్నాయి. దొరికిన వారిపై దాడి చేస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా పదుల సంఖ్యలో శునకాలు వీధుల్లో తిరుగుతుండడంతో జనాలు రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. నిత్యం కుక్కకాటు బాధితులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు. వీటి సంఖ్య పెరగకుండా కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో కుక్కలు అడ్డు వచ్చి వాటిని తప్పించబోయి గ్రామానికి చెందిన పలువురు ఇటీవల గాయపడ్డారు. స్థానిక పాత పోలీస్‌స్టేషన్, బీబీపేట రోడ్డులో కుక్కలు ఎక్కువగా రోడ్డుపై అడ్డు రాగా, వాటిని తప్పించే క్రమంలో బైక్‌లు అదుపు తప్పిపడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

రోడ్ల పక్కన కోళ్ల వ్యర్థాలు..

ముఖ్యంగా మండల కేంద్రంలో చికెన్ దుకాణాల వద్ద కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. రోడ్ల పక్కనే కోళ్ల వ్యర్థాలు పడేయడటంతో కుక్కలు తిరుగుతున్నాయి. చికెన్ దుకాణదారులు కోళ్ల వ్యర్థాలను దారుల వెంట వేయడంతో వాటిని తినేందుకు పోట్లాడుకుంటున్నాయి. కోళ్ల వ్యర్థాలను గ్రామానికి దూరంగా వేసేలా, పంచాయతీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభించిన ఒక రోజుకే దిగబడ్డ లారీ



పాముల వాగు వద్ద తాత్కాలిక డైవర్షన్ రోడ్డులో దిగబడిన లారీ

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. 45 రోజులుగా బస్సులు, లారీల రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవతో డైవర్షన్ రోడ్డుకు రూ.కోటి మంజూరు చేయించారు. నెల రోజుల నుంచి డైవర్షన్ రోడ్డు పనులు చేపట్టారు. మొదట వర్షాలు కురియడంతో రోడ్డు పనులు నత్తనడకన కొనసాగాయి. పది రోజులుగా వర్షాలు ఆగిపోయి ఎండలు కొడుతుండటంతో రోడ్డు పనుల్లో వేగం పెంచారు. వాగు మధ్యలో కంకర రోడ్డు వేసి రెండు వరుసల్లో పైపులు వేశారు. పైపులకు ఇరువైపులా మొరం వేసి రోలర్‌తో తొక్కించి రాకపోకలు పునరుద్ధరించారు. రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి కంకర, రాళ్లు వేయకుండానే కేవలం మొరం వేయడంతో రాకపోకలు పునరుద్ధరించిన ఒక రోజుకే లారీ దిగబడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెనకు ఇరువైపులా మొరం దిగబడుతుండడంతో ఆదివారం నుంచి భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఆదివారం తిరిగి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే రోడ్డు నాణ్యతగా చేపట్టడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పోతాయిపల్లి జెడ్పీహెచ్ఎస్ 2009-10 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోతాయిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 2009–10 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులందరూ 15 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోటికి చేరడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

బాల్కొండ : పేద ప్రజలు ఆత్మ గౌరవంతో బ్రతకాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న ఇరిగోల్ల లక్ష్మి అనే లబ్ధిదారు గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుతో కలిసి నూతన ఇంట్లోకి వెళ్లారు.

మున్నూరు కాపు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

కామారెడ్డి అర్బన్: మున్నూరు కాపు కాచిగూడ విద్యార్థి వసతిగృహం ట్రస్టు స్కాలర్ షిప్ కోసం మున్నూరు కాపు అనాథ, ప్రతిభ గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్‌రావు, పి.అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు లేనివారే కాకుండా 80 శాతం పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 10వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు 94416 31943 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్డులో బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



దీపెంతలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి



స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో దీపావళి సందడి నెలకొంది. జిల్లా ప్రజలు పండుగకు ఒకరోజు ముందుగానే ఆదివారం సామగ్రి కోసం తరలిరావడంతో కిటకిటలాడింది. ప్రధాన ప్రాంతాల్లో, రోడ్ల పక్కన ప్రమిదలు, పూలు, పండ్లు, పూజా సామగ్రి, టపాసుల దుకాణాలను వ్యాపారులు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. అలాగే టపాసులు అమ్మేందుకు దుకాణదారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎక్కడ చూసిన పండుగ సామగ్రి కొనుగోళ్లతో దీపావళి శోభ సంతరించుకుంది. –సాక్షి నెట్‌వర్క్



లక్ష్మీదేవి చిత్రపటాలను కొనుగోలు చేస్తూ..



జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తూ..



పటాకులు కొనుగోలు చేస్తూ..

రెండు రోజుల్లో పేకాడుతున్న 81 మంది అరెస్ట్

- రూ. 85వేలు నగదు స్వాధీనం
- ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గడిచిన రెండు రోజుల్లో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో పేకాడుతున్న 81 మందిని అరెస్ట్ చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద నుంచి రూ.85వేల నగదు, 41 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పేకాడిన వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేశామన్నారు. పేకాట, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదన్నారు. దీపావళి నేపథ్యంలో పేకాటపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా పేకాడితే పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 87126 86133కు గానీ, డయల్ 100కు గానీ ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.


బట్టాపూర్‌లో..

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని బట్టాపూర్‌లో ఒక ఇంట్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,01,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఐదు సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన కాంట్లే రాజు, కమ్మర్‌పల్లికి చెందిన బోదాసు రాజు లారీలో ఇసుకను నింపుకుని ఏర్గట్లవైపు వస్తుండగా లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసుకున్నామన్నారు,

లింగంపేటలో ట్రాక్టర్..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని పెద్దవా గు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రాజు అనుమతులు లేకుండా పెద్ద వాగు నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముదక్‌పల్లిలో టిప్పర్..

మోపాల్: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదక్‌పల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుస్మిత ఆదివారం తెలిపారు. డ్రైవర్ మహేష్ సరైన అనుమతులు చూపకపోవడంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలు ఇలా.. తాడ్వాయికి చెందిన గాంధారి రమేష్ (40) ఈనెల 14న ఉదయం మొక్కజొన్న కొట్టడానికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం అతడు ఇంటికి రాగా, కొద్దిసేపటికే మళ్లీ బయటకు వెళ్లాడు. రాత్రయినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు తాడ్వాయి బస్టాండ్ దగ్గర అతడు కిందపడి ఉండటంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 18న సాయంత్రం రమేష్ మృతిచెందాడు. మృతుడికి భార్య ముత్తవ్వ, కూతుర్లు కీర్తన, శృతి ఉన్నారు. మృతుడి భార్య ముత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మోపాల్ మండలంలో మహిళ..

మోపాల్: మండలంలోని గుడి తండాలో శనివారం రాత్రి జరిగిన దాడి ఘటనలో ఓ మహిళ గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన రుదవత్ నీలాబాయి (41), భర్త వామన్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు వినోద్, తన భార్యతో కలిసి గ్రామంలోనే ఆటో నడుపుకుంటున్నాడు. ఇటీవల వారి కుటుంబంలో కలహాలు నెలకొనగా, శనివారం రాత్రి వామన్, వినోద్ మధ్య గొడవ జరిగింది. ఇద్దరిని నీలాబాయి సముదాయించే ప్రయత్నం చేయగా కోపోద్రిక్తుడైన వామన్ ఆమె తలపై కర్రతో కొట్టాడు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు వామన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పలువురిపై కుక్కల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు


సిరికొండ: మండల కేంద్రంతోపాటు కొండూర్ గ్రామంలో ముగ్గురిపై కుక్కలు వేర్వేరుగా దాడి చేశాయి. మండల కేంద్రంలో ఇద్దరిపై, కొండూర్ గ్రామంలో అద్వైత్ అనే బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. స్థానికులు వెంటనే వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మండల కేంద్రంలో గేదెపై కూడా కుక్క దాడి చేసినట్లు తెలిసింది.

సెమీస్ చేరిన జిల్లా వాలీబాల్ జట్టు



నిజామాబాద్ నాగారం: మహబూబ్ నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కొనసాగుతోంది. పోటీల్లో నిజామాబాద్ జట్టు సెమీస్‌కు చేరినట్లు సమాచారం. ఈసందర్భంగా క్రీడాకారులకు జిల్లా క్రీడల కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

'సాగర్' గేటు ఎత్తివేత



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల నుంచి 7,048 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక వరద గేటును ఎత్తారు. వరద గేటు ద్వారా 4,048 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలో వదులుతున్నామని ప్రాజెక్టు ఏఈ సాకేత్ తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీల)కు ప్రస్తుతం 1405 అడుగులు (17.8 టీఎంసీల) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.